# "కలంచునే ప్రజలపాటుల్ మంత్రిసత్త్రంబులన్!"

ఈశ్వర్

'నే చెప్పలేదటండీ! ఎవడిమటుకు వాడాలోచించాలిగాని ప్రతిదానికీ రాజస్థానాన్ని జవాబుదారీ చేస్తే ఎలాగా? ఇవాళ పేపరు చూడండి, మంత్రిగారు ఎంత భేషుగ్గా చెప్పారో' అని మంచి వడితో ప్రారంభించారు, పొడుం ముక్కులో దట్టిస్తూ శాస్త్రిలుగారు.

'ఏమిటండోయ్! ఇవాళ మీరు కొంచెం దూకుడుగా వున్నారు. పేపర్లో మీకు అనుకూలవార్తఏదైనా వుందా?' అన్నా నేను మెల్లిగా అరుగుమీద చేరుతూ.

'వార్త ఏమిటోయ్ - వార్త! మంత్రిగారి ఉద్ఘాటన!'

ఇవాళ యీయన గొడవేదో చిగురంటా చూసేదాకా తొందరపడకూడదని నేనూ మెల్లిగా స్థిరపడ్డా, పద్మాసనం వేసి-శాస్త్రిలుగారు 'ఆఫర్' చేసిన పొడుంపట్టు నిరాకరించకుండా.

'అసలు తాత్పర్యం ఏమిటో తెలుసా? ప్రతివాడు లంచగొండితనం, బ్లాక్‌మార్కెట్టు అని వెర్రిగంతు లెయ్యకపోతే దొంగతనంగా కొనడం మానెయ్యరాదా అని. ఇచ్చేవాడు, కొనేవాడు వుంటేనే గదా యీ దురాచారాలు సాగేది. అందుకనే, చీటికీ మాటికీ ప్రభుత్వంమీద పడితే లాభంలేదు. ఎవళ్ళమటుకు వాళ్లు కొన మానేస్తే దెబ్బకి 'గప్‌చిప్' అని మంత్రిగారి సెలవు. నిజంగా మంత్రంటే మంత్రా, వజ్రాల మూటలాంటి మాట చెప్పాడు' అని శాస్త్రిలుగారు తమ మామూలు ధోరణిలో పడ్డారు.

ఇవాళ పెద్ద చిక్కే వచ్చింది. ఈశాస్త్రిలు ఓపట్టాన వదిలేలా లేడు. 'ఊఁ:' కొడితే వూపు ఎక్కువౌతుంది. కాదంటే యింక కదం తొక్కడం ప్రారంభిస్తాడు. చిక్కుల్లోపడ్డ నాకు తోడు ఎవరా అని యోచించా. సరే! వుత్తరపదం పట్టడానికి ఎప్పుడూ వుత్సాహపడే మా చందూ, చదరంగంబల్ల కట్టిపెట్టి మెల్లిగా మాలో కలిశాడు.

'శాస్త్రిలుగారూ! మీ రన్నది అక్షరాలా నిజం' అని మెల్లిగా కిర్రెక్కించాడు.

'కాదుటండీ మరి! ప్రతివాడూ అనేవాడే గాని చేసేవాడేవడు?' అని శాస్త్రిలు తనవాదన అడ్డదారి తొక్కించాడు.

ఈ పీచాపాటీకి నేను యితోధికంగా తోడ్పడ నిశ్చయించా.

'అయితే-జీవితాని కత్యవసరమైన వస్తువులు బహిరంగంగా అమ్మరు. దొంగ మార్కెట్టులో కొనకపోతే ప్రాణావసరం గడవదు. అప్పుడేం చెయ్యమంటారు?' అన్నా.

'ఏదైనా సరే-బాధ పడాలి. లేకపోతే అన్యాయానికి అడ్డుపెట్టడం ఎలా?'

'అన్యాయాన్ని అడ్డగించడం యిలా కాదు. పంపకవిధానం, కంట్రోలు పద్ధతులు సక్రమంగా వుంచి, త్యాగవంతులైన సామాన్య ప్రజలనుండి, పార్టీకక్షల పక్షపాతంలేకుండా, సరియైన సహకారం తీసుకొని పని చెయ్యడం మొదట అవసరం. లంచగొండితనం, దొంగవ్యాపారం పట్టియివ్వడంలో ప్రజల సహాయంతో నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించడం తర్వాత జరగాలి. అంతేగాని పంపక విధానంలోని లోపాలు, ప్రభుత్వశాఖల్లోని దుర్నీతి కప్పిపుచ్చుకుందుకు యీ కుంటివాదన లెందుకు?'

'ఏమైనా, మరీ మనవాళ్లు ప్రతీదానికీ ఎగబడతారండీ. అది మానుకోవాలి.'

'సరే—డబ్బెక్కువగా వుండి దర్జాకోసం దొంగమార్కెట్టు కెగబడే వాళ్ళను గురించి మనం వూపిరి వ్యర్థం చేసుకోవడం అనవసరం. వాళ్ళలో, అనాయాసంగా అన్ని అవినీతిమార్గాల ద్వారా రెండు చేతులతోనూ గడించిన వాళ్లు. కొందరు ఆడబ్బుకు విముక్తిమార్గం ఆలోచిస్తాం

టారు. కాని, ప్రధానజీవితావసరవస్తువులకే కరువై దెబ్బతింటున్న సామాన్య బీదజనం సంగతి మనం ఆలోచించాలి. వీళ్ల ఏం ఒళ్లు కొవ్వెక్కి కొనరు. కొందామన్నా తాహతులేదు. లేకపోతే సొంగ వన్నవి కొంటారు. వుద్యోగుల అసమర్థతవల్ల, వ్యాపారస్థుల అవినీతివల్ల బహిరంగంగా దొరకనప్పుడు ఎలాగో సంపాదించుకోక చస్తారా? దానికి నిందించాల్సింది ప్రజలని కాదు. వాళ్ళని రక్షిస్తామని కంకణం కట్టుకున్న వాళ్లనీ, వారి చేతి క్రింద పని చేస్తున్న నియమరహిత శాఖలనీ' అని, చందూకేసి చూశా ఏమంటాడో అని. వాడు సిగరెట్టు పొగల వలయాల్ని కలగలుపుగా వదలుతూ నిశ్చింతగా వింటున్నాడు. సునాయాసపు కులాసాకబుర్లు చెప్పమంటే తాడూ, కూరూ లేనివి ఎన్నైనా చెప్తాడు. కాని, కొంచెం ఆలోచించాల్సిన సంగతి వుంటే మాత్రం 'చాల్లే వోయ్' అనేస్తాడు. తన అభిప్రాయం చెప్పక తప్పదంటే మాత్రం 'చిక్కు, చింత' లేని పక్షం కేసి మొగ్గుతాడు, ఎందుకైనా మంచిదని. మళ్లీ శాస్త్రులు వుక్కు అందుకున్నాడు—

'అయినా, లంచగొండితనం అంతగా లేదని పండితుడు చెపుతున్నాడు కదండీ.'

'నిజమే, నిజమే! ఆయనకు కనపడదు- అది వాస్తవమే. ప్రతి ఆఫీసులోను, మార్కెట్లలోను, చిన్నవస్తువునుండి ప్రాణాన్ని నిలబెట్టే మందులదాకా, నానాగడపలు ఎక్కవలసిన అవసరం ఆయనకులేదుగా! అందుచేత సహజంగా యివేవీ కనపడవు. తిరగటిరాళ్ళ మధ్యపడి నలిగిపోయే పప్పుబద్దలాంటివాడి నడిగితే అంతగాలేదో, కొంతగాలేదో కాస్త చెప్పతాడు- వినేవాళ్ళ కళ్ళవెంబడి రక్తపుచుక్కలు కారేలా' అన్నా.

మనం ఎన్ని చెప్పనీ, శాస్త్రులు అంతతేలిగ్గా మెత్తపడేరకం కాదు. ఆయనవాదన కొసదాకా ఎలాగైనా నిలబెట్టుకుంటాడు- యీ ప్రయత్నంలో ఎన్నిసాధనాలైనా ఎరువు తెచ్చుకుంటాడు. పొడుంకాయ రొంటినుండి తీస్తూ శాస్త్రులుగారు కొంచెం చమత్కార ధోరణిలో 'రేపు మనకీ ఎక్కడైనా సందుదొరికితే దోచుకుందామనే చూస్తాం. దీనికి యితరులనంటే ప్రయోజనం ఏమిటి?' అన్నారు.

'ఉన్నమాట అన్నారండి! యీ పళాన వెయ్యిరూపాయిలు యిస్తానంటే ఏదో మన చేతిలోపని చేసిపారెయ్యం!' అన్నాడు చందూ సిగరెట్టును పూర్తిచేసి.

'వాతావరణం అపరిశుభ్రంగా వుంది కాబట్టి దాన్నే పొడిగిస్తానంటారా లేక యీ విష వలయాన్ని ఎక్కడో ఒకదగ్గర ఛేదిస్తానంటారా? అంతా యిలాగే అయిపోతారంటే నే నమ్మను. కొత్తరకంలో నూతనోత్సాహం లేకపోలేదు. కాని పద్ధతులు మారకపోతే విషపాత్రలో పాలచుక్కలుపడినట్లే ప్రయోజనం కూడా వుంటుంది. బ్రిటిష్ పాలన జీర్ణంచేసుకుని, ఆ అవసరాల కోసం నియమితమైన పద్ధతులు, ఆ వ్యక్తులు, ఆ తరగతులే యీ నాటికీ ప్రతిశాఖకీ అధినేతలు; ఆ పద్ధతులే యీ నాటికీ ప్రమాణాలు. అటువంటప్పుడు నిజంగా ముందుకొచ్చిన యువకు డెవడైనా వుంటే డిపార్టుమెంటులో 'కీచు' మనిపిస్తున్నారు. దోచుకునేవాడినే అదృష్టవంతుణ్ణిగా చేస్తున్నారు. ప్రజల సహకారం తీసుకోవాలనే ప్రయత్నమే లేదు. దుర్నీతి వుందంటే వుండదూ? బ్లాక్ గాళ్లు నడివీధిలో సవాలిచ్చి అమ్ముతున్నారు. డిపార్టుమెంటుమీద డిపార్టుమెంట్లు వున్నాయే, యివన్నీ ఏమైనట్టు? అసలు వుత్పత్తి స్థానంలోనే పకడ్బందుగా వుంటే సగం బాధ తగ్గుతుందే!' అన్నా.

శాస్త్రులు యింక వేదాంతం, ఆధ్యాత్మిక సారం వూత తీసుకుని చర్చ కొనసాగించారు.

'నే చెప్తా వినండి! పాపం పండిపోయింది. ప్రజలు నీతి విడిచిపెట్టారు. అందుచేత వీళ్ళకి యిది దేవుడిచ్చిన శిక్ష! బాధ పడాల్సిందే. రాజు దైవనియమితుడు. అటువంటి రాజు బుద్ధిపూర్వకంగా ఎప్పుడూ తప్పులు జరగనీడు. ఏవైనా మన కంటికి కనపడ్డాయంటే అవి యీ ప్రజల తప్పులకి శిక్ష. ప్రజలు ముందు పరిశుద్ధులయితే అప్పుడు రాజ్యం దాని ననుసరించే బాగుపడుతుంది' అన్నారు శాస్త్రులుగారు.

చందూ మాట్లాడ్డానికి 'బలే ఛాన్సు' దొరికిందనుకున్నాడు.

'ముమ్మాటికీ నిజమండీ శాస్త్రులుగారూ! ఇలాగే, ఒకటవజేమ్సు అని ఒక ఇంగ్లీషురాజు వుండేవాడు. ఆయనేమన్నాడో విన్నారా—

రాజు ప్రజలను పాలించడానికి దైవంచే నియమించబడ్డాడు. ఏవైనా కష్టాలు, తప్పులు వుంటే దానికి రాజు నసాల్సిన పనిలేదు. ప్రజలు చేసే పాపానికి శిక్షగా దేవుడే యివి ప్రసాదిస్తాడు. కాబట్టి అనుభవించాల్సిందే! ఎప్పుడయ్యా యీ కష్టాలు పోతాయంటే, ప్రజలెప్పుడు పరిశుద్ధులయితే అప్పుడు. ప్రజలు తమ దోషాలు తొలగించుకుందుకు దేవుడ్ని ప్రార్థించాలి. ఇదొక్కటే శరణ్యం' అని ఓ చిరునవ్వు నామీద కోలగా విసిరాడు.

నాకూ నవ్వొచ్చింది. 'ఒరే చందూ! నువ్వు చెప్పిన సిద్ధాంతానికి తిరుగులేదురా. మహామంచి మాట చెప్పావు. నిజమే. ప్రజల అసమర్థతే ప్రస్తుత పరిస్థితులకి కారణం. ప్రజల ఆలోచనా శక్తి క్షీణతే ప్రస్తుతపు నిలువుదోపిడికి మూలం. వారి నిద్రమత్తే సర్వవ్యాప్తమైన లంచగొండితనానికి ఆసరా. ప్రజలే కళ్లుతెరిచి జ్ఞానవంతులుగా వుంటే యీ గమ్మత్తులు జరగనే జరగవు. ప్రజలు చైతన్యవంతులైతే ప్రభుత్వం వారి కనుగుణ్యమయ్యేదే వుంటుంది. నిజమే—యథా ప్రజా, తథారాజా!' అని ముగించాను, యీ విపరీత వాదాన్ని.

'అహ్హాహ్హా!' అని భళ్ళున నవ్వి, శాస్త్రిలు 'అక్కడే వుందండీ కీలకం! కిటుకు!' అని పంచ సర్దుకుని లేచేసరికి, మేంకూడా యింటి ముఖం పట్టాం.

# ముందు జాగ్రత్త

"హితశ్రీ"

ఆరోజు ఉదయం లేచీ లేవడంతో నాగరాజు దర్శనం కావడం దేశరాజుకి గుండెల్లో రాయి పడ్డట్టయింది. అప్రయత్నంగా దేశరాజు కంఠంనుండి వెలువడ్డ గావుకేక విని నాగరాజు తలయెత్తి అతడివైపు చూసి శిరఃకంపనం చేసి చరచరా జారుకున్నాడు. దేశరాజుకి పైప్రాణం పైనే పోయింది. నాగరాజు సంగతి అందరికీ తెలిసిందే. పగ పట్టాడంటే అటోయిటో తేల్చుకునే రకం. తను నాగరాజుకి ఇంతవరకు ఏమీ ఉపకారంచేసి ఎరగడు; చేయాలనిలేదు కూడా. తనమనస్సువిప్పి అతడితో చెప్పగలిగితేఎంతబాగుండును—'ఓ నాగయ్యా, నువ్వంటే నాకు ఎంతమాత్రం ద్వేషంలేదు. నలుగుర్నీ పోగుచేసి నిన్ను తన్నించాలనే ఉద్దేశం నాకు ఏకోశానా లేదు. నాజోలికి నువ్వు రాకుండా ఉంటే నాకదే పదివేలు.' అని అతడు నమ్మగలిగేలా చెప్పడం ఎలా? చెపితే అర్థంచేసుకునే మనిషి గనకనా! దేశరాజుకి ఏమీ తోచలేదు. ఆలోచించి ఎందుకైనా మంచిదని ఆ సాయంత్రం ఓ దుడ్డుకర్ర సంపాదించి పడకగదిలో మంచానికి చేరువగా పెట్టుకున్నాడు.

నిజం చెప్పాలంటే నాగరాజుకి కూడా దేశరాజుకి అనవసరంగా అపకారం చేయాలనే దుర్బుద్ధిలేదు. కాని దేశరాజు ఉనికి తనకి ప్రమాదకరంగా పరిణమించగలదనే సందేహం అతడిని పట్టుకుంది. బలవంతుడు; నలుగురు మనుష్యుల అండగలవాడు. ముందుముందు తనవల్ల ఏదైనా అపకారం జరగవచ్చునేమోనని తను పరాకుగాఉన్న ఏ సమయంలోనో తన పని పట్టించడానికి ప్రయత్నం చేయడని ఎలా నమ్మడం? దేశరాజుని ఎందుకైనా ఒకకంట కనిపెట్టి ఉండడం మంచిదనుకున్నాడు నాగరాజు. చీకటి పడడంతో దేశరాజు ఇంటి చుట్టూ ప్రదక్షిణంచేసి పడకగది కిటికీలోనుంచి తొంగిచూశాడు నాగరాజు. దుడ్డుకర్రమీద ఒకచేయి ఉంచి నిద్రపోతున్నాడు దేశరాజు. నాగరాజు బుసకొట్టాడు.

కలతనిద్ర పోతూన్న దేశరాజు బుస విని హఠాత్తుగా లేచి చుట్టూ చూశాడు. నల్లగా చీకట్లో జారుకుంటున్న నాగరాజుని చూసి గుండె పట్టుకున్నాడు దేశరాజు. నాగరాజు తనని చంపటానికి నిశ్చయించుకున్నాడు, ఏమీ సందేహంలేదు. మర్నాడు—

మధురమైన సంగీతం విని తన ఇంటిలోంచి బయటికి వచ్చాడు నాగరాజు. దేశరాజు!...

దేశరాజు నురగలు కక్కాడు. నాగరాజు వెల్లకిలబడ్డాడు. కాకులకీ, గద్దలకీ పండుగ; పని లేని జనానికి ఉబుసుపోక.